

టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలి

భీమవరం రూరల్ : భీమవరంలో టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ 82 ఎకరాల్లో టిడ్కో ఇళ్లు నిర్మించి ఎనిమిదేళ్లయినా ఇంతవరకూ మౌలిక వసతులు కల్పించలేదని, దానివల్ల డ్రెయినేజీ నీరు బయటకు వెళ్లే మార్గం లేక అపార్ట్మెంట్ల చుట్టూ చేరి దోమలతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌కు తెలియజేయగా అక్కడ అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేసుకొని దానికయ్యే ఖర్చు ప్రజలే భరించాలని చెప్పటం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్ వెంకటేశ్వరరావు, ఎం.రాంబాబు, మావుళ్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విచ్ఛిన్నానికి.. విశ్వప్రయత్నాలు..!


పాలకోడేరులో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

- పాఠశాలల ప్రాంగణం, ఆనుకుని ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యత ఉపాధ్యాయులకు
- సచివాలయ ఉద్యోగుల పరిధిలో మిగిలిన కేంద్రాల నిర్వహణ
- జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశాలు జారీ
- భగ్గుమంటున్న ఉపాధ్యాయ సంఘాలు
- అగమ్యగోచరంగా మధ్యాహ్న భోజన కార్మికుల పరిస్థితి
- జిల్లాలో 8వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి - భీమవరం

అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం సామ, దాన, దండోపాయాలు ఉపయోగిస్తోంది. సమస్యలు పరిష్కరించాల్సింది పోయి ఏదేమైనా సమ్మెను నిర్వీర్యం చేయాలనే చూస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలు, అంగన్‌వాడీల పట్ల కుట్రపూరిత చర్యలకు ఉసుగొల్పుతోంది. పాఠశాలల ప్రాంగణంలో, పాఠశాలలను ఆనుకుని ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యత ఉపాధ్యాయులదేనని, మిగిలిన కేంద్రాలు సచివాలయ ఉద్యోగులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాలు సైతం భగ్గుమంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా మంగళవారం 8వ రోజు అంగన్‌వాడీల సమ్మె ఉధృతంగా సాగింది.

ప్రభుత్వం తాను చెప్పేదే జరగాలి అన్నట్లుగా వ్యవహరిస్తోంది. తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు ఈ నెల 12వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టీ పట్టనట్లు వ్యవహరించడమే దీనికి నిదర్శనం. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు అనేక రకాల అస్త్రాలనూ ఉపయోగిస్తోంది. అయినా అంగన్‌వాడీలు వెనకడుగు వేయకుండా న్యాయ పోరాటం చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఏదో విధంగా అంగన్‌వాడీల ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను దౌర్జన్యంగా పగలగొట్టి తెరిచారు. దీంతో ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి రావడంతో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌పై బాధ్యత పెట్టి కేంద్రాలను తెరిపించారు. అయితే నిర్వహణ కష్టతరం కావడంతో కఠిన నిర్ణయాలు తీసుకుని అమలు చేయాలని నియంతృత్వ పోకడకు తెర లేపింది. ప్రభుత్వ పాఠశాలలు కాంపౌండ్లలో, పాఠశాలల సమీపాన ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని ఆదేశాలు వచ్చాయి.

జిల్లాలో సుమారు 1500 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. దీనిలో పాఠశాలల ప్రాంగణంలో 268, పాఠశాలల సమీపాన 82 కేంద్రాలు ఉన్నాయి. మిగిలిన అంగన్‌వాడీ కేంద్రాలను సచివాలయ ఉద్యోగుల పరిధిలో నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అంగన్‌వాడీ చిన్నారులందరికీ మధ్యాహ్న భోజన పథకంలో భోజనాన్ని పెట్టాలని హుకుం జారీ చేశారు. ప్రభుత్వం నుంచి జిల్లా కలెక్టర్లకు, అక్కడ నుంచి జిల్లా విద్యాశాఖకు, ఉపాధ్యాయులకు, సచివాలయ ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేసి అమలు చేయాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరికలు కూడా ప్రభుత్వం నుంచి వెలువడ్డాయి.

జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు

అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి విద్యాశాఖ అధికారులకు మౌలికంగా ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాల్టీల్లో కమిషనర్లు, మండలాల్లో ఎంపిడిఒల ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో, పాఠశాలకు ఆనుకుని ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరూ అంగన్‌వాడీ కేంద్రాలు తెరవాలని, ఆయా కేంద్రాల తాళాలు అంగన్‌వాడీ ఆయాతో తెరిపించాలని లేనిపక్షంలో సచివాలయ సిబ్బంది సహకారంతో ఆయాల వద్ద తాళాలు తీసుకొని ప్రధానోపాధ్యాయులు తెరిపించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఫుడ్ తదితర వివరాలను పంచనామా ద్వారా రికార్డు చేయాలని సూచించారు. పంచనామాను విఆర్‌ఒ, పంచాయతీ సెక్రటరీ, మహిళా పోలీసు (వార్డు, గ్రామ, మహిళా సంరక్షణా కార్యదర్శి), ఎడ్యుకేషన్ అసిస్టెంట్ (వెల్ఫేర్ అసిస్టెంట్), గ్రామ సర్పంచి/ వార్డు ఇన్‌ఛార్జి తదితర సచివాలయ సిబ్బంది నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మొత్తం పాఠశాలల పరిధిలోని కేంద్రాలన్నీ తెరవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా చిన్నారులకు వండి పెట్టాలని ఆదేశించారు.

ఉపాధ్యాయులపై మరింత భారం

కలెక్టర్ ఆదేశాలతో ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమంటున్నాయి. ఇప్పటికే ఉపాధ్యాయులు బోధన బోధనేతర పనులతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఉపాధ్యాయులపై పెట్టడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు సుమారు 1400 వరకూ ఉన్నాయి. ఆయా పాఠశాలలో మొత్తం 6 వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అయితే ఇప్పటికే ఉపాధ్యాయులు రకరకాల యాప్‌లు, సర్వేలు, బోధన అనేక రకాల పనులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే అంగన్‌వాడీల సమ్మెకు ఐక్య ఉపాధ్యాయ సంఘాలన్నీ సంపూర్ణ మద్దతు ఇప్పటికే ప్రకటించాయి. అయితే ప్రభుత్వం అంగన్‌వాడీల నిర్వహణ బాధ్యతను ఉపాధ్యాయులపై పెట్టడం పట్ల ఉద్యమాన్ని నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వం ఆలోచిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అగమ్యగోచరంగా మధ్యాహ్న భోజన కార్మికుల పరిస్థితి

అంగన్‌వాడీ చిన్నారులకు మధ్యాహ్న భోజనం పెట్టాలని ఆదేశాలు జారీ చేయడంతో మధ్యాహ్న భోజన కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో సుమారు 500 నుంచి 600 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇప్పటికే చాలీచాలని ఛార్జీలతో మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన చెందుతుంటే ఇప్పుడు వారిపై ఆర్థిక భారం కూడా మోపింది. ప్రస్తుతం విద్యార్థుల మధ్యాహ్న భోజనం నిమిత్తం ఒక్కొక్కరికీ ప్రాథమిక పాఠశాలలో రూ.5.88, ఉన్నత పాఠశాలలో రూ.8.57 చొప్పున కార్మికులకు చెల్లిస్తున్నారు. బియ్యం ఒక్కటే ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఇప్పటికీ బిల్లుల చెల్లింపులు పూర్తిస్థాయిలో జరగలేదు. గౌరవ వేతనాలు కూడా అందించిన దాఖలాల్లేవు. పాఠశాలల్లో మరుగుదొడ్ల శుభ్రపర్చే కార్మికులకు నేటికీ జీతాలు చెల్లించని పరిస్థితి.

ప్రభుత్వ ఆదేశాలు ఉపసంహరించుకోవాలి..



బి.గోపీమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి

అంగన్‌వాడీల సమ్మెకు యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. ఉపాధ్యాయులకు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతలు మోపడం దుర్మార్గం. ఇప్పటికే పని భారంతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలి. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ యుటిఎఫ్ అండగా ఉంటుంది.

ప్రభుత్వ నిర్ణయం సరికాదు ..★★★



ఎల్.సాయి శ్రీనివాస్, ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు

అనేక పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. నాలుగేళ్ల నుంచి డిఎస్‌సి ప్రకటించలేదు. బోధన, బోధనేతర పనులతో ఉపాధ్యాయులకు పని భారం పెరిగింది. మరింత పని భారం మోపడం సరికాదు. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను.

పని భారం మోపడం తగదు..★★★



పివిఎస్‌ఎస్‌బి.రమణారావు, ఎపిటిఎఫ్ 1938 జిల్లా శాఖ జనరల్ సెక్రటరీ

ప్రస్తుతం సవాలక్ష సమస్యలతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. మళ్లీ అంగన్‌వాడీ కేంద్రాలు బాధ్యత పెడితే మరింత పని భారం పడుతుంది. ప్రభుత్వం పునరాలోచన చేయాలి. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా లేఖ రాశాం. ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఉపాధ్యాయులదే ..★★★



ఆర్.వెంకటరమణ, డిఇఒ, భీమవరం

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రాంగణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల దగ్గర్లో ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యత ఉపాధ్యాయులదే. అంగన్‌వాడీ చిన్నారులకు పాఠశాలలో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకంలో భోజనాన్ని వండి పెట్టడం జరుగుతుంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చర్యలు తీసుకోవడం జరిగింది.


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలని నోడల్ అధికారులకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ వద్ద జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి సంయుక్తంగా ఎన్నికల విధులకు నియమించిన 22 మంది జిల్లా నోడల్ అధికారులతో రానున్న ఎన్నికల్లో చేపట్టాల్సిన పనులపై క్షుణ్ణంగా అంశాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పొరపాట్లకు తావులేని విధంగా అధికారులు అప్రమత్తతతో విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పొరపాటు అనే పదానికి తావు ఉండదని, చర్యలు తప్పకుండా ఉంటాయనే విషయం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని తెలిపారు. సందేహాలను, సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఎన్నికల్లో స్వీప్ యాక్టివిటీ ఎంతో కీలకమైందన్నారు. దీన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత నోడల్ అధికారి కెసిహెచ్ అప్పారావును ఆదేశించారు. లా అండ్ ఆర్డర్, మ్యాన్ పవర్, ఇవిఎం, ట్రాన్స్‌పోర్ట్, ట్రెయినింగ్, మెటీరియల్ మేనేజ్మెంట్లు, ఎంసిసి, ఎంఎంసి టీంలు ఏర్పాటు, ఎన్నికల వ్యయం మానిటరింగ్, బ్యాలెట్ పేపర్, డమ్మీ బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ, మీడియా కమ్యూనికేషన్, హెల్ప్ లైన్ అండ్ కంప్లైంట్స్, కమ్యూనికేషన్ ప్లాన్, పోలింగ్ పర్సనల్ వెల్ఫేర్, పిడబ్ల్యుడి ఓటర్స్, వెబ్ కాస్టింగ్, అబ్జర్వర్లు, ఫైనాన్షియల్ మేనేజ్మెంట్, ఈ- రోల్ అండ్ గ్రీవెన్స్, రిపోర్ట్స్ అండ్ సర్క్యూలర్స్ తదితర పనుల నిర్వహణకు నియమించిన నోడల్ అధికారులకు విధులపై కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులుగా నియమితులైన వివిధ శాఖల జిల్లా అధికారులు బి.శ్రీమన్నారాయణ రెడ్డి, కెసిహెచ్ అప్పారావు, ఆర్.వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, ఉమా మహేశ్వరరావు, కెసిహెచ్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్


నరసాపురంలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు చేపట్టిన నిరసన కొనసాగింది. ప్రజల ఆస్తులకు భద్రత లేని ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నరసాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించారు. అనంతరం ప్రదర్శనగా వెళ్లి స్థానిక అంబేద్కర్ విగ్రహం కూడలి వద్ద కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ మహిళా న్యాయవాదులు ఓసూరి జ్యోతిమాంగళ్య, రాయసం రాధారాణి, కొప్పినీడి చిట్టి పద్మజ మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన భూహక్కు చట్టం ప్రజా వ్యతిరేకమైందని తెలిపారు. ఈ చట్టం వల్ల అనవసరమైన వివాదాలు సృష్టించబడతాయన్నారు. అంతేకాకుండా నిజమైన భూ హక్కుదారులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. తక్షణం ఈ చట్టాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేసారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొప్పర్తి శిరీష, కురెళ్ల అనూష, అడబాల సుజాత, కంభాల స్వర్ణ, ఆర్.రజని, చల్లా దానయ్యనాయుడు, తంగెళ్ల వెంకటేశ్వరరావు, కానూరి స్వామి నాయుడు పాల్గొన్నారు.

తణుకురూరల్ : భూ యజమాని హక్కు యాక్టు 27ను వెంటనే రద్దు చేయాలని తణుకు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెవివి సత్యనారాయణమూర్తి, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తణుకు బార్ అసోసియేషన్, ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చడీచప్పుడు లేకుండా ఎపి భూ హక్కుల చట్టాన్ని తీసుకొచ్చిందని, ఈ చట్టం అక్టోబరు 31 నుండి అమల్లోకి వచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం జిఒ 512 జారీ చేసిందని తెలిపారు. ఇది కేవలం కొంతమంది పెట్టుబడిదారులకు ఉపయోగపడుతుందన్నారు. వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చింతపల్లి నాగేశ్వరరావు, న్యాయవాదులు వెలిచెటి గోవిందరావు, జి.అంబేద్కర్, వి.సుధాకర్ పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తూ అంగన్‌వాడీల వినూత్న నిరసన

ఎనిమిదో రోజు కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అంగన్‌వాడీలు మంగళవారం ఎనిమిదో రోజు భిక్షాటన చేస్తూ వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకిచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్ల తప్పని పరిస్థితిలో సమ్మె చేపట్టాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో టీచర్స్ అండ్ హెల్పర్స్‌తో పాటు, సిఐటియు అధ్యక్షులు బి.వాసుదేవరావు, సిఐటియు మండల అధ్యక్షులు ఇంజెడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆచంట : ఆచంట కచేరీ సెంటర్లో అంగన్‌వాడీల సమ్మె ఎనిమిదో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, పుడక నాగలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, వెంకటలక్ష్మి సుజాత, సత్యవతి, విజయలక్ష్మి, దుర్గమ్మ, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

కాళ్ల : సమస్యను పరిష్కరించకుండా ఉద్యమాన్ని అణచి వేయాలనుకోవడం సరికాదని కాంగ్రెస్ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. సమ్మెకు కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అంబేద్కర్ విగ్రహం వరకూ ప్రదర్శన చేపట్టి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి మండా సూరిబాబు, యడవల్లి చంద్రావతి, ఝాన్సీరాణి, డి.మార్తమ్మ పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాస ప్రసాద్ మాట్లాడారు. డ్వాక్రా మహిళలు జయలక్ష్మి, సరస్వతి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దిద్దే వెంకట్రావు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, సివిల్ సప్లై హమాలీలు శ్రీరామ చంద్రుడు, రైస్ మిల్లు వర్కర్లు సంఘీభావం తెలిపారు.

పోడూరు : మంగళవారం అంగన్‌వాడీలు పోడూరు, కవిటం సెంటర్లలో భిక్షాటన చేశారు. అనంతరం దీక్షా శిబిరానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు రాజా రామ్మోహన్ రాయ్, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, ప్రాజెక్టు లీడర్ పీతల రాజమణి, జె.ఉమాదేవి, రాయుడు కుమారి పాల్గొన్నారు.


ఆకివీడులో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

అత్తిలి: అత్తిలిలో అంగన్‌వాడీలు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆందోళనకు కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు కేతా గోపాలన్ సంఘీభావం తెలిపారు.

పాలకొల్లు : పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నేతలు ఎం.శ్రీదేవి, బి.నాగలక్ష్మి, పి.పద్మావతి పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : అంగన్‌వాడీల నిరవధిక సమ్మెకు వెలుగు యానిమేటర్ల ఉద్యోగుల సంఘం సంఘీభావం తెలిపింది. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎ.నిర్మల ఉపాధ్యక్షులు కె.గోవిందమ్మ, జిల్లా నాయకులు వెంకటలక్ష్మి, ఉమా జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నిర్మల, జిల్లా నాయకులు గోవిందమ్మ, వెంకటలక్ష్మి, ఉమా మాట్లాడారు.

తాడేపల్లిగూడెం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఎనిమిదివ రోజుకు చేరింది. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద భిక్షాటన చేస్తూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు దివ్య స్వరూపారాణి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ నాయకులు పి.నాగేంద్ర, వైవి.దుర్గారావు, అంగన్‌వాడీ వర్కర్స్ పాల్గొన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బంకుర యశోద పాల్గొన్నారు.

ఇరగవరం : అంగన్‌వాడీలను రోడ్లపై అడుక్కునే విధంగా చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు అడ్డగర్ల అజయకుమారి విమర్శించారు. ఎనిమిదో రోజు దీక్షలో భాగమగా ఇరగవరం మండల కేంద్రంలో అంగన్‌వాడీలు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అజయకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో మండల లీడర్లు శ్యామల, ప్రభావతి, నాగమణి, రూపవతి, ముసలమ్మ, అనసూయ, నాగలక్ష్మీ, అమరావతి పాల్గొన్నారు.

ఆకివీడు : అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా మంగళవారం సిఐటియు నాయకులతో కలిసి భిక్షాటన చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పెంకి అప్పారావు, అంగన్‌వాడీలు పైడేశ్వరి, కనకదుర్గ, రామలక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : అంగన్‌వాడీలు పట్టణంలోని షాపుల వద్దకు వెళ్లి భిక్షాటన చేసిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, అంగన్‌వాడీ నాయకులు జె.శ్రీలక్ష్మి, రజిని, నిర్మలకుమారి, రాజేశ్వరి, వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

తణుకురూరల్ : అంగన్‌వాడీల పోరాటానికి గత ప్రభుత్వాల పునాధులు కదలిపోయాయన్న సంగతి జగన్మోహన్‌రెడ్డి గుర్తించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ హెచ్చరించారు. 8వ రోజు సమ్మెలో భాగంగా నరేంద్ర సెంటర్ వరకూ అంగన్‌వాడీలు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ప్రతాప్ మాట్లాడారు. కార్యక్రమంలో వసంత, మణిమాలతి, ప్రమీల, కనకదుర్గ, మధుషీల, రాజకుమారి, ధనలక్ష్మి, రాణి, భారతి, సాయికుమారి, పద్మావతి, సత్యవతి, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు : అంగన్‌వాడీల సమ్మె 8వ రోజు కొనసాగింది. ఈ క్రమంలో అంగన్‌వాడీలు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి, జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్, ఐకెపి సిఎలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమాల్లో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దిరాజు, ఎడ్ల చిట్టిబాబు, నాయకులు పాల్గొన్నారు.

రాంగోపాల్ వర్మ క్షమాపణ చెప్పాలి

తమ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ బహిరంగ క్షమాపణలు చెప్పాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. మంగళవారం మొగల్తూరులో దీక్షా శిబిరం వద్ద రాంగోపాల్ వర్మ చిత్రపటాన్ని చెప్పుతో కొట్టి దహనం చేశారు. అనంతరం భిక్షాటన చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, ఎడ్ల చిట్టిబాబు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఉండి : అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మహమ్మద్ హసీనా బేగం ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు జోలె పట్టి భిక్షాటన చేస్తూ ప్రభుత్వ తీరును ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మహమ్మద్ హసీనా బేగం మాట్లాడారు. దీక్షలకు సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ధనికొండ శ్రీనివాస్, కొట్టాడ వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు.

పెనుగొండ : అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా మంగళవారం భిక్షాటన చేసిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలతో పాటు ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.


అత్తిలిలో..


మొగల్తూరులో రాంగోపాల్ వర్మ ఫొటోను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

రైతునేత హరేరామ్‌కు సతీ వియోగం

ప్రజాశక్తి - ఆచంట


నాగకుమారి (ఫైల్‌ఫొటో)

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ సతీమణి, సిపిఎం సానుభూతి పరురాలు ఆకుల నాగకుమారి (62) సోమవారం అర్ధరాత్రి పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువులోని స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. నాగకుమారి భౌతికకాయానికి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతి పట్ల సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్), రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారామ్, రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కేశవరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి, ఏలూరు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, మహిళా నేతలు ఎ.అజయ్‌కుమారి, కె.పద్మజ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, నేతలు నాగేశ్వరరావు, గార రంగారావు, పుల్లారెడ్డి, సూర్నీడి వెంకటేశ్వరరావు, కె.సుబ్బరాజు, లక్ష్మీకుమారి, నాగశెట్టి గంగారావు, కుడిపూడి నాగేశ్వరరావు, చింతపల్లి అప్పారావు, చిన వీరభద్రం, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ సంతాపం తెలిపారు.

వీరవాసరం : రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ సతీమణి ఆకుల నాగకుమారి (62) గుండెపోటుతో మృతి చెందారు. ఆమె మృతికి రైతు సంఘం మండల కమిటీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నాగకుమారి మృతికి రైతు సంఘం నాయకులు బాలం విజయకుమార్, తాళ్లూరి హరిహర రామ లక్ష్మణ్, యాళ్లబండి నారాయణమూర్తి సంతాపం తెలిపారు.

30, 31 తేదీల్లో భీమవరం బాలోత్సవం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక శ్రీరామపురంలోని వసుధ ఫౌండేషన్ కార్యాలయంలో భీమవరం బాలోత్సవం కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో తొలుత ఎంఎల్‌సి షేక్‌సాబ్జీని స్మరణ చేసుకుని, వారి సేవలను గుర్తు చేసుకుని నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఈ నెల 30, 31 తేదీల్లో జరిగే భీమవరం బాలోత్సవం కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. భీమవరం బాలోత్సవంలో ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకు బాలబాలికలు పాల్గొని విజయవంతం చేయాలని అధ్యక్షుడు ప్రసాదరాజు పిలుపునిచ్చారు. వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు సోదరుడు కృష్ణంరాజుకు భీమవరం బాలోత్సవం ఆహ్వాన బ్రోచర్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో భీమవరం బాలోత్సవం కమిటీ అధ్యక్షులు ఇందుకూరి ప్రసాదరాజు, అసోసియేట్ అధ్యక్షులు జి.జేమ్స్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య, కోశాధికారి పి.సీతారామరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి అల్లూరి అరుణ్, సహాయ కార్యదర్శి ధనుష్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళనకు యుటిఎఫ్ మద్దతు

ప్రజాశక్తి - కాళ్ల

న్యాయమైన కోర్కెల సాధనకు సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని యుటిఎఫ్ కాళ్ల మండల అధ్యక్షులు బిఆర్‌ఎస్.స్వామి అన్నారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు యుటిఎఫ్ కాళ్ల మండల శాఖ మంగళవారం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు వెంకన్నబాబు, బాలాజీ, ప్రకాష్, అప్పారావు, పుష్పరాజ్, అకౌంటెంట్ రోహిణి, ధన్య పాల్గొన్నారు.

ఎస్‌కెఎస్‌డి విద్యార్థినులకు అభినందన

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ (ఉమెన్) ఇంటర్ కాలేజియేట్, యూనివర్సిటీ సెలక్షన్స్‌లో ఎస్‌కెఎస్‌డి కళాశాల విద్యార్థినులు నాలుగో స్థానాన్ని సాధించారని ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ఈ నెల 17వ తేదీన కాకినాడ ఐడియల్ కాలేజీలో ఎంపికలు జరిగాయి. అందులో ఎస్‌కెఎస్‌డి కళాశాల విద్యార్థినులు కె.స్వాతి, కె.జయశ్రీ, జి.అనూష, ఎం.భువన, సిహెచ్.మధులత, పి.రమ్య, పి.షారోన్, యుఎస్‌డి భవాని నాల్గో స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా వారిని కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, ఫిజికల్ డైరెక్టర్ ఎం.రత్నకుమారితో పాటు పలువురు అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న సత్యఉషారాణి

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

నిరుపేద కుటుంబానికి చెందిన యువతి పెళ్లికి దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకటరామరాజు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. మండలంలోని కాళ్లకూరు గ్రామానికి చెందిన అడవిళ్లు రామారావు మనవరాలు గౌరిమానస వివాహానికి దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు రూ.ఐదు వేల ఆర్థిక సాయం మంగళవారం అందించారు.

సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యుడు బహిష్కరణ

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా, విద్యుత్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకుడిగా ఉన్న కామన సంజయ్‌ని సిఐటియు నుంచి బహిష్కరిస్తున్నామని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిఐటియు నిబంధనలకు, నిర్మాణ పద్ధతులకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని గుర్తించి చెప్పినా మార్పు రాకపోవడంతో సిఐటియు అన్ని బాధ్యతల నుంచి బహిష్కరిస్తున్నామని వారు తెలిపారు. సిఐటియుకు వ్యతిరేకంగా మాట్లాడుతూ, కార్మిక ఐక్యతను విచ్ఛిన్నం చేసే చర్యలకు పాల్పడుతున్న కామన సంజయ్‌ను సిఐటియు నుంచి బహిష్కరిస్తూ జిల్లా కమిటీ నిర్ణయం తీసుకుందని తెలిపారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు నరసాపురం ప్రాంతంలో ఇతర కార్మిక వర్గం సిఐటియు విశ్వసనీయతను, పటిష్టతను కాపాడే విధంగా ఇలాంటి వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పాఠశాలకు ఐరన్ ర్యాక్స్ పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులోని జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో యుకెసి అవార్డు కమిటీ చైర్‌పర్సన్ కామిశెట్టి అయ్యప్పనాయుడు సౌజన్యంతో లైబ్రరీ బుక్స్, వంట పాత్రలు పెట్టుకునేందుకు మూడు ఐరన్ ర్యాక్స్ బుధవారం బహూకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఇఒ-2 ఆర్‌ఎన్‌విఎస్‌జి.శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అవసరమని చెప్పారు. పాఠశాలలు అభివృద్ధి చెందాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్, ఎంటిఎస్ టీచర్ కాళ్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణపవరంలో 'భేటీ బచావో-భేటీ పడావో'

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని అన్ని సచివాలయాల వద్ద వంద రోజుల పాటు బేటీబచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లలను రక్షించండి అంశంపై స్థానికులకు అవగాహన కల్పిస్తామని గణపవరం ప్రాథమిక ఆసుపత్రి డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. స్థానిక మూడో సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వచ్చే ఏడాది జనవరి వరకు తమ వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ఆడపిల్లల రక్షణ విషయంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. వారికి ఆరోగ్యం విద్యపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, ఎంపిటిసి సభ్యులు సీతామహలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు నల్లయ్య, జి.శ్రీనివాస్, ఎక్కుర్తి, ఎం.యోహాన్, ఎఎన్‌ఎం ప్రేమలీల పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు అందజేత

ప్రజాశక్తి - మొగల్తూరు

తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన అన్నదాతలకు రాయితీపై విత్తనాలు అందిస్తున్నామని వ్యవసాయ శాఖ ఎఒ అబ్దుల్‌రహీం తెలిపారు. రైతులకు 1121, 1153 విత్తనాలను 80 శాతం మొగల్తూరు, రామన్నపాలెం, శెట్టిపాలెం, పేరుపాలెంలోని అన్నదాతలకు మంగళవారం ఎంపిపి సూర్యావతి చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.అనితకుమారి, ఎంపిడిఒ ఉండ్రు బాబ్జీరాజు, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, సీతామహలక్ష్మి పాల్గొన్నారు.

కోపల్లెలో 'జనంలోకి జనసేన'

ప్రజాశక్తి - కాళ్ల

జనసేన-టిడిపి ఉమ్మడి కార్యాచరణలో రానున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నామని జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు అన్నారు. మండలంలోని కోపల్లెలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జనసేన-టిడిపి ఉమ్మడి కార్యాచరణలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఓటరుకు ఎన్నికల గుర్తుతో ముద్రించిన కరపత్రాలను అందించారు. జనసేన, టిడిపి బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ జనసేన-టిడిపి ఉమ్మడి కూటమికి మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాళ్ల మండలాధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, గడి రాము, గవర లక్ష్మి, తోట వాసు, గాదం నానాజీ, అల్లాడి బాలాజీ, ఎడవల్లి వెంకటేశ్వరరావు, పిల్లా బాబు, మేక కాశీ చరణ్, దారపురెడ్డి కన్నబాబు, ఓగిరాల రాజేష్, షేక్ నసీమ్, ఆరేటి దిలీప్‌కుమార్, కోటికలపూడి శివకృష్ణ, నరహరిశెట్టి బాబి, సాల ప్రభుదాస్, మొబారి కృష్ణ, కట్ట సతీష్, నిమ్మల రాఘవ, సూరకల భోగేంద్ర పాల్గొన్నారు.

23న కల్లు గీత కార్మిక సంఘం జిల్లా మహాసభ

జయప్రదానికి రాష్ట్ర అధ్యక్షులు నరసింహమూర్తి పిలుపు

ప్రజాశక్తి - పోడూరు

ఈ నెల 23వ తేదీన జరగనున్న కల్లు గీత కార్మిక సంఘం 31వ మహాసభను జయప్రదం చేయాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి పిలుపునిచ్చారు. నాలుగున్నరేళ్లుగా గీతన్నలను గాలికి వదిలేయడమే కాకుండా ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించి అభిషేకాలు చేయించుకుని 14 నెలలు గడిచినా ఇవ్వకపోవటం సిగ్గుచేటని విమర్శించారు. పాలకొల్లు సర్కిల్ గీత సొసైటీ ప్రెసిడెంట్ల సమావేశం పోడూరులో బొంతు శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశానికి అతిథిగా హాజరైన నరసింహమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో గీత కార్మికులు వృత్తిలో బతకలేని పరిస్థితి ఉందన్నారుర. పొరుగు రాష్ట్రాలు కల్లుగీతను ఆదుకోవడమే కాకుండా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. పాలకులు వారి ప్రయోజనాలే తప్ప, గీతన్నల వృత్తి ఆధునీకరణ, తాటి ఉత్పత్తుల పరిశ్రమలు నెలకొల్పటం, నీరా పరిశ్రమ వంటి వాటి గురించి ఆలోచించడంలేదన్నారు. జగన్ నాడు పాదయాత్రలో ఇచ్చిన హామీలు నమ్మి ఓట్లు వేసిన గీత కార్మికులను మోసగించారన్నారు. ఈ నెల 23వ తేదీన భీమవరంలో జరిగే 31వ జిల్లా మహాసభలో వృత్తిరక్షణ, ఉపాధి, సంక్షేమం, ప్రభుత్వం అనుసరించే విధానాలపై చర్చించి భవిష్యత్తు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ఈ జిల్లా మహాసభకు ముఖ్యఅతిథిగా ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొంతు శ్రీను, సత్యనారాయణ, బురాబత్తుల వెంకటరావు పాల్గొన్నారు.

అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి

మొగల్తూరు మండల సమావేశంలో ఎంపిపి సూర్యావతి



మొగల్తూరు మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సూర్యావతి

ప్రజాశక్తి - మొగల్తూరు

అభివృద్ధికి అందరూ సమన్వయంతో పని చేయాలని ఎంపిపి సూర్యావతి అన్నారు. మొగల్తూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. పలువురు సభ్యులు ఆయా గ్రామాల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. 2023 - 24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై చర్చించి తీర్మానించారు. ఈ సమావేశానికి 21 ఎంపిటిసిలకు ఏడుగురు, 17 మంది సర్పంచులకు 12 మంది సర్పంచులు, అధికారులు, ఐసిడిఎస్, సోషల్ వెల్ఫేర్, ఆర్టిసి, పోలీస్, ఉద్యానవన, మత్స్య, సహకార శాఖల సిబ్బంది గైర్హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఉండ్రు బాబ్జీరాజు, తహశీల్దార్ జి.అనితకుమారి, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, వైస్ ఎంపిపిలు కైలా సుబ్బారావు, కవురు సీతామహాలక్ష్మి, ఇఒపిఆర్‌డి నవీన్‌కిరణ్ పాల్గొన్నారు.

దాళ్వాలో ప్రతి ఎకరాకూ నీరు

పోడూరు మండల సమావేశంలో జెడ్‌పిటిసి పెద్దిరాజు

పోడూరు : రానున్న దాళ్వా పంటకు ప్రతి ఎకరాకు నీరు అందించే బాధ్యత ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు తీసుకున్నారని జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కా ర్యాలయంలో ఎం పిపి సబ్బితి సుమంగళి సాగర్ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు పాల్గొని తమ శాఖలపై జరుగుతున్న, జరగనున్న పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సిఎం జగన్ బడుగు, బలహీన, పేద ప్రజల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీ వైద్యం ఖర్చును రూ.25 లక్షల వరకు పెంచడం అభినందనీయమన్నారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందకుండా పంటను విక్రయించుకోవచ్చన్నారు. రానున్న దాళ్వా పంటకు ప్రతి ఎకరాకు నీరు అందించే బాధ్యత శ్రీరంగనాథరాజు తీసుకున్నారన్నారు. అనంతరం ఎంపిడిఒ డి.సుహాసిని ఆధ్వర్యంలో జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు చేతుల మీదుగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేయించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి - మొగల్తూరు

యుటిఎఫ్ మొగల్తూరు మండలం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి వికెవి.రామభద్రం వ్యవహరించారు. గౌరవ అధ్యక్షులుగా ఎన్.బుజ్జిబాబు, అధ్యక్షులుగా చింతపల్లి కృష్ణమోహన్, ఉప అధ్యక్షులుగా ఎవి.మురళీధర్, ఉషా మాధవి, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.శ్రీనివాస్, కోశాధికారిగా కె..బ్రహ్మయ్య, సభ్యులుగా ఎఎన్.మూర్తి, షేక్ జాని, టి.మాధవ్, వై.క్రాంతికుమార్, హర్ష శ్రీకాంత్, డి.చింతయ్య, ఎం.భాగ్యలక్ష్మి, పి.ఏసురత్నం, వై.శ్యాంబాబు, సిహెచ్.సూర్యప్రకాష్, ఆడిట్ కన్వీనర్ కెఎన్.గంగరాజు ఎన్నికయ్యారు. అనంతరం వారు ప్రమాణస్వీకారం చేశారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశే జగన్ లక్ష్యం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పేదవారికి వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా సిఎం జగన్ మరో వరం అందించారని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ పథకంలో రూ.ఐదు లక్షల విలువైన ఉచిత వైద్యం ప్రజలకు అందుతుండగా, ఈ సౌకర్యాన్ని రూ.25 లక్షల వరకు పెంచుతూ సిఎం జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో, అనంతరం తాడేరు గ్రామంలో ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించడంపై జరిగిన అవగాహనా సదస్సుల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం నూతన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు పేరిచర్ల విజయనరసింహరాజు, జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ప్రోగ్రాం జిల్లా కో-ఆర్డినేటర్ కీర్తి పాల్గొన్నారు.

నేడు మెడికల్ రిప్రెజెంటేటివ్‌ల దేశవ్యాప్త సమ్మె

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రెజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ మెడికల్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన మెడికల్ రిప్రెజెంటేటివ్‌ల దేశవ్యాప్త సమ్మె చేయనున్నట్లు భీమవరం శాఖ అధ్యక్షులు శ్రీనివాసరాజు, భీమవరం యూనియన్ కార్యదర్శి కెఎం.సూర్యచంద్రరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మెలో దేశవ్యాప్తంగా మూడు లక్షల మందికి పైగా మెడికల్ రెప్రెజెంటేటివ్‌లు పాల్గొనున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్, సేల్స్ రిప్రెజెంటేటివ్స్ యూనియన్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం చౌక్ వద్ద సమ్మె శిబిరం ఏర్పాటు చేసి నిరసన తెలియజేయనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా భీమవరం శాఖ అధ్యకులు ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎనిమిది డిమాండ్లతో మెడికల్ రిప్రెజెంటేటివ్‌లందరూ ఈ సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. సమ్మెలో భీమవరం శాఖ ఆధ్వర్యంలో 350 మంది మెడికల్ రిప్రెజెంటేటివ్‌లు పాల్గొనున్నారని పేర్కొన్నారు. ఒకరోజు దేశవ్యాప్త సమ్మెకు అన్ని కార్మిక ఉద్యోగ సంఘాలు మద్దతు తెలిపాలని కోరారు.

ఇంధన పొదుపుపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ఉండి

ఇంధనాన్ని పొదుపుగా వాడుదాం.. భావితరాలకు భరోసానిద్దాం అని ఉండి మెయిన్ సెంటర్‌లో విద్యుత్ సిబ్బంది ప్రచార ర్యాలీని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఉండి మెయిన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన ర్యాలీలో విద్యుత్ సిబ్బంది మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యుత్తును, చమురు ఇంధనాన్ని పొదుపుగా వాడాలని సూచించారు. త్రీ స్టార్ రేటింగ్ అంతకంటే ఎక్కువగా ఉన్న గృహోపకరణాల వినియోగం వల్ల విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు. చమురు ఇంధన వాహనాల వాడకం తగ్గించాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలిపారు. విద్యుత్ ఆదాను ఇంటి వద్ద నుంచే ప్రారంభించాలని, అనవసరమైన వాటికి లైట్లు, ఫ్యాన్లు వేయొద్దని చెప్పారు.

వైఎస్ఆర్ బీమా రూ.5 లక్షలు అందజేత

భీమవరం రూరల్ : మండలంలోని తాడేరు గ్రామానికి చెందిన పెంటపాటి పరుశురాముడు ఇటీవల పొలం పని చేస్తుండగా పాముకాటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా సాయం అందేలా చేశారు. వైఎస్ఆర్ బీమా పథకం నుంచి రూ.5 లక్షల నగదును పరుశురాముడు భార్య మంగతాయారు బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేసేలా చర్యలు తీసుకున్నారు. మంగళవారం నగదు జమకు సంబంధించిన పత్రాలను ఆమెకు ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అందించారు.

యుటిఎఫ్ టెస్ట్ పేపర్స్ అందజేత

ప్రజాశక్తి - అత్తిలి



విద్యార్థులకు టెస్ట్ పేపర్స్ అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి యుటిఎఫ్ టెస్ట్ పేపర్స్‌ని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి కొమ్మర హైస్కూల్ హెచ్‌ఎం జొన్నాడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన పని చేస్తున్న కొమ్మర ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులందరికి సుమారు రూ.మూడు వేల విలువైన టెస్ట్ పేపర్స్ ఉచితంగా తన సొంత ఖర్చులతో అందించారు. వారికి మండల శాఖ పక్షాన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉద్యమ అభినందనలు తెలిపారు. గోపీమూర్తి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ మెటీరియల్ బాగా చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకత్వం, కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'దళితులను మోసగించిన జగన్'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

వైసిపి ప్రభుత్వంలో దళితులకు అమలు జరిగే 27 పథకాల రద్దుతో పాటు ఎస్‌సి సబ్‌ప్లాన్‌ను నిర్వీర్యం చేసిందని టిడిపి, జనసేన ఎస్‌సి సెల్ నాయకులు అన్నారు. మండలంలోని లంకలకోడేరు గ్రామ చినపేటలో మంగళవారం టిడిపి, జనసేన ఎస్‌సి సెల్ నాయకులు ఇంటింటికి వెళ్లి పథకాల రద్దుతో దళితులు ఏ విధంగా మోసం, దగాకు గురయ్యారో వివరిస్తూ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్నది దళితుల మేలు కోరే టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వమేనని తెలిపారు. దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు విచ్చలవిడిగా జరుగుతున్నా సిఎం జగన్ ఖండిస్తూ మాట్లాడకపోగా సమర్థిస్తున్నారన్నారు. దళితుల సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కోడి విజయభాస్కర్, గ్రామ అధ్యక్షులు పెనుమత్స సత్యనారాయణరాజు, నెక్కంటి ఆదినారాయణ, పాముల రజినికుమార్, అందేకోటి వీరభద్రం, సర్పంచి చొప్పల రజిని, చొప్పల వెంకట్రావు, జనసేన పార్టీ నాయకురాలు రీన, కుడక కోటేశ్వరరావు, నెక్కంటి దుర్గారావు, చాగంటి అన్నవరం, పాలపర్తి మణికుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య పథకాలను వినియోగించుకోవాలి

డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని చింతపర్రు సచివాలయం వద్ద సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్పయాత్ర సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిఎంహెచ్ఒ మహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైద్య ఆరోగ్య పథకాలను ప్రతిఒక్కరూ తెలుసుకుని వినియోగించుకోవాలని తెలిపారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రమాదకర లక్షణాలు గల ఏడో నెల నుంచి 9వ నెల గర్భిణులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత రవాణా, పరీక్షలు, మందులు, రక్త సరఫరా, పోషకాహారం సేవలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉన్నమట్ల కపర్ది, పాలకొల్లు అసెంబ్లీ కన్వీనర్ ఎర్రంశెట్టి పద్మారావు, దొంగ నరసింహకుమార్, పటమట శ్రీనివాసరావు, గూడవల్లి వాసుదేవ్, కూర్మా మురళి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి.సూర్యశేఖర్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సెక్రటరీ మహమ్మద్ సులేమాన్, సూపర్‌వైజర్ జి.ఉదయ్‌చందర్, కె.సతీష్, ఎంఎల్‌హెచ్‌పి కృష్ణవేణి, ఎఎన్ఎం అనిత, హెల్త్ అసిస్టెంట్ తారకసత్య, సురేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎం కళాశాలలో జాతీయస్థాయి సెమినార్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆక్వా కల్చర్‌పై జాతీయ స్థాయి సదస్సు మంగళవారం నిర్వహించారు. రొయ్యలు, చేపల సాగులో పురోగతి, సవాళ్లు, అవకాశాలు అంశంపై సదస్సు నిర్వహించారు. సద స్సును ఏలూరు కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో వివిధ ఆక్వా ఉత్పత్తుల సంస్థలు సంయుక్తంగా కళాశాల జంతు శాస్త్ర విభాగం, ఆక్వా కల్చర్ విభాగం ఐక్యుఎసి ద్వారా నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా డాక్టర్ ఎ.మట్టారెడ్డి, ప్రొఫెసర్ జి.సింహాచలం, ప్రొఫెసర్ సిహెచ్.మంజులత, కె.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షత వహించారు. ఆదికవి నన్నయ యూనివర్శిటి జువాలజీ డిపార్ట్‌మెంట్ డాక్టర్ మట్టారెడ్డి, గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ జువాలజీ, ఆక్వాకల్చర్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ జి.సింహాచలం, విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీ జువాలజీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ సి.మంజులత పొల్యూషర్ ఏలూరు కంట్రోల్ బోర్డు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ సదస్సుకు సుమారు 150 మంది వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొని తమ పరిశోధనా పత్రాలను అందించారు. ప్రస్తుతం ఆక్వా రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులకు జాతీయస్థాయిలో జరుగుతున్న ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని పలువురు వక్తలు అన్నారు. ఈ కార్యక్రమానికి జువాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం.రామకృష్ణ కన్వీనర్‌గా వ్యవహరించారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వక్తలు

'గూడెం, భీమవరం, పాలకొల్లులో ఎక్కడో చోట పవన్ పోటీ'

ప్రజాశక్తి - పాలకొల్లు

రానున్న ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, నిడదవోలు, పిఠాపురం నియోజకవర్గాల్లో ఒక చోట నుంచి పోటీ చేయవచ్చని మాజీ ఎంపీ చేగొండి హరరామ జోగయ్య తెలిపారు. తాజా రాజకీయాలపై జోగయ్య జనసేన పోటీచేసే అభ్యర్థుల లిస్ట్‌ను విడుదల చేశారు. రానున్న ఎన్నికల్లో జనసేనకు సీట్ల పంపకం ఒక ప్రహసనంగా మారిందని మాజీ ఎంపీ చేగొండి హరరామజోగయ్య తెలిపారు. టిడిపికి చెందిన వివిధ మాధ్యమాలు జనసేనకు 28 సీట్లని కొందరు, 25 సీట్లని కొందరు వివిధ రకాలుగా ప్రచురిస్తూ ప్రకటిస్తున్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జనసేన సపోర్టుతో టిడిపి వైసిపిని ఓడించగలిగి అధికారం చేపట్టడం అతి సులువని స్పష్టమవుతోందని తెలిపారు.

21న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 21వ తేదీన సిఎం జగన్ పుట్టినరోజును పురస్కరించుకుని వైసిపి పాలకొల్లు నియోజకవర్గ కార్యాలయం వద్ద మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ ఆధ్వర్యంలో ఈ మెగా వైద్య శిబిరం నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీగా యువతను సమీకరిస్తున్నారు.